dctelugu.com

# డిస్ట్రిక్ కాలమ్

జిల్లాల వార్తావాహిని

e-PAPER

కరీంనగర్ సపుంటి: 01 సంచిక: 32 సోమవారం 21 సెప్టెంబర్ 2026

## కరీంనగర్ సిటీ సమాచారం

### ఉత్సాహంగా శాతవాహన వాకర్స్ స్పీడ్ వాక్, కప్పగంతుల పోటీలు

**విజేతలకు బహుమతులు అందజేసిన నిర్వాహకులు**

కరీంనగర్



లయన్స్ క్లబ్ ఆఫ్ కరీంనగర్ గోల్డెన్ శాతవాహన ఆధ్వర్యంలో శాతవాహన యూనివర్సిటీ వాకర్స్‌కు స్పీడ్ వాక్, కప్పగంతుల పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో వాకర్స్ ఉత్సాహంగా పాల్గొని ప్రతిభ చాటారు. స్పీడ్ వాక్ పోటీల్లో కుర్రె తిరుపతి ప్రథమ, మల్లారెడ్డి ద్వితీయ, కనకాచారి తృతీయ స్థానాల్లో నిలిచారు. అలాగే కప్పగంతుల పోటీల్లో అస్తపురం మహేష్ ప్రథమ, గుండు నర్సయ్య ద్వితీయ స్థానాల్లో బహుమతులు గెలుచుకున్నారు.

?ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథి లయన్ కెప్టెన్ డా. మధుసూధన్ రెడ్డి, రీజియన్ ఛైర్పర్సన్ లయన్ మానువాడ శంకర్, గోల్డెన్ శాతవాహన అధ్యక్షులు లయన్ ననువాల గిరిధర్ రావు, కార్యదర్శి లయన్ పాశం నర్సింహా రెడ్డి, మైక్రో క్యాబినెట్ మెంబర్ లయన్ అక్కినపల్లి అజయ్ కుమార్, కోశాధికారి లయన్ చిలుపూరి రాములు, డైరెక్టర్లు లయన్ బండారి గంగాధర్, లయన్ పూట్ల దేవయ్య తదితరులు పాల్గొన్నారు.




# కరీంనగర్‌లో రూ.కోట్లతో అభివృద్ధి పనులు

- కేంద్ర మంత్రి బండి సంజయ్
- చెత్త సేకరణ, డంపింగ్ యార్డ్ సమస్యల
- పరిష్కారానికి చర్యలు.. కాంగ్రెస్ తీరుపై ధ్వజం



కరీంనగర్ డీసీ

కరీంనగర్ మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయ ఆవరణలో మేయర్ కొలగాని శ్రీనివాస్, డిప్యూటీ మేయర్ సునీల్ రావు, స్థానిక కార్పొరేటర్లతో కలిసి కేంద్ర మంత్రి బండి సంజయ్ మీడియాతో మాట్లాడారు. నగరంలో చెత్త సేకరణ కోసం ప్రతి డివిజన్‌కు ఒక త్రిచక్ర వాహనాన్ని మున్సిపల్ సిబ్బందికి అందజేస్తున్నామని, కొత్తగా కొనుగోలు చేసిన ఫాగ్ మిషన్లు, అదనపు ట్రాక్టర్లను ప్రజలకు అందుబాటులోకి తెస్తున్నామన్నారు. కరీంనగర్‌లో డంపింగ్ యార్డ్ సమస్యను పరిష్కరించబోతున్నామని, రూ.17 కోట్లతో బయోమైనింగ్ పనులకు టెండర్లు మొదలుకానున్నాయని వెల్లడించారు. అలాగే మరో రూ.80 కోట్లతో యూసీఎఫ్ నిధులతో సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్ పనులు, రూ.16 కోట్లతో ఫ్రెష్ వేస్ట్ మేనేజ్‌మెంట్ పనులు ప్రారంభించబోతున్నామని చెప్పారు.

?22ఏ సమస్యలపై పోరాటం

22ఏ (22ఔా) కారణంగా ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, గత బీఆర్ఎస్, ప్రస్తుత కాంగ్రెస్ పాలకులు దీనిని తమకు అనుకూలంగా వాడుకున్నారని విమర్శించారు. ఈ సమస్యను పరిష్కరించకపోతే తదుపరి కార్యాచరణ చేపడతామని, అవసరమైతే న్యాయపరమైన పోరాటం చేస్తామని స్పష్టం చేశారు.

?ఘనంగా గణేశ్ నిమజ్జనోత్సవాలు కరీంనగర్‌లో గణేశ్ నవరాత్రి నిమజ్జన ఉత్సవాలను గతం కంటే ఘనంగా నిర్వహించబోతున్నామని, ఎక్కువ బడ్జెట్ కేటాయించామని తెలిపారు. మహిళల భాగస్వామ్యం ఎక్కువగా కనిపిస్తుండటం హర్షణీయమన్నారు. భక్తియుత వాతావరణంలో ఉత్సవాలు నిర్వహించాలని, తప్పుడు ప్రచారాలు నమ్మకుండా పోలీసులకు పూర్తిగా సహకరించాలని కోరారు. అధికారులు, పోలీసుల నుంచి ఏమైనా ఇబ్బందులుంటే మేయర్, డిప్యూటీ మేయర్, కార్పొరేటర్లను సంప్రదించాలని, తప్పకుండా సమస్యలు పరిష్కరిస్తామని భరోసా ఇచ్చారు.

రాజకీయ విమర్శలుకాంగ్రెస్ నేతల ఫాంహౌజ్ సందర్శన పెద్ద జోక్ అని బండి సంజయ్ ఎద్దేవా చేశారు. కేసీఆర్ ఫాంహౌజ్ ఏమైనా టూరిజం కేంద్రమా అని ప్రశ్నించారు. అధికారం మీ చేతుల్లోనే ఉందని, ప్రభుత్వ భూములుంటే అధికారులను పంపి స్వాధీనం చేసుకోవాలని, వాటి ఆధారాలు సీఎం బయటపెట్టాలని డిమాండ్ చేశారు. ఖైరతాబాద్ ఉప ఎన్నికలను ఎదుర్కొనే ధైర్యం లేక కాంగ్రెస్ సుప్రీంకోర్టుకు వెళ్లిందని ఆరోపించారు. ఉప ఎన్నికల్లో పోటీ బీజేపీ, బీఆర్ఎస్ మధ్యే ఉంటుందని, కాంగ్రెస్ అసలు పోటీనే కాదన్నారు. దానం నాగేందర్ తనను తాను ఖైరతాబాద్ వినాయకుడితో పోల్చుకోవడం ఆశ్చర్యకరమని, వినాయకుడిని చివర్లో నిమజ్జనం చేస్తారనే విషయం గుర్తుంచుకుంటే మంచిదని వ్యాఖ్యానించారు. ఆయన నిండు నూరేళ్లు జీవించాలని కోరుకుంటూనే, ఖైరతాబాద్ ఉప ఎన్నికల్లో కాంగ్రెస్‌కు రాజకీయ నిమజ్జనం తథ్యమని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో ,మేయర్ కొలగాని శ్రీనివాస్, డిప్యూటీ మేయర్ సునీల్ రావు, స్థానిక కార్పొరేటర్లు తదితరులు పాల్గొన్నారు.

### వెలిచాలలో ఘనంగా 10వ విడత శ్రమదానం..

**పరిశుభ్రతపై అవగాహన కల్పిస్తూ ముందుకు సాగుతున్న పాలకవర్గం**



**రామడుగు డీసీ**

కరీంనగర్ జిల్లా రామడుగు మండలం వెలిచాల గ్రామ పంచాయతీ పరిధిలో 'స్వచ్ఛతా హి సేవ - 2026' కార్యక్రమంలో భాగంగా ఆదివారం 10వ విడత శ్రమదాన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. 'మన ఊరు - మన బాధ్యత ' 'పరిశుభ్రమైన వెలిచాల - ఆరోగ్యకరమైన వెలిచాల' అనే నినాదంతో సర్పంచ్ వీర్ల నర్సింగరావు, పాలకవర్గం సభ్యులు ముందుండి ఈ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించారు. ఆదివారం ఉదయం 8:00 నుంచి 9:00 గంటల వరకు గ్రామ పరిధిలోని 6వ వార్డు, దుర్గమ్మ గడ్డ ప్రాంతంలో ఈ శ్రమదానం జరిగింది. రోడ్లకు ఇరువైపులా పెరిగిన పిచ్చి మొక్కలు, ముళ్ల పొదలు, చెత్తాచెదారాన్ని తొలగించి పరిసరాలను శుభ్రపరిచారు. ఈ శ్రమదానంలో భాగంగా గ్రామ సర్పంచ్, పాలకవర్గం గ్రామంలోని మహిళలు, యువకులు, పెద్దలకు పరిసరాల పరిశుభ్రత, తడి-పొడి చెత్త విభజన, దోమల నివారణ చర్యలపై విస్తృతంగా అవగాహన కల్పిస్తూ చైతన్యవంతంగా ముందుకు సాగుతున్నారు. పరిశుభ్రతతోనే సంపూర్ణ ఆరోగ్యం సాధ్యమని, గ్రామాభివృద్ధిలో ప్రజల భాగస్వామ్యం ఎంతో అవసరమని వారు స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్, వార్డు సభ్యులు, పంచాయతీ సిబ్బందితో పాటు మహిళలు, యువకులు, పెద్దలు పెద్ద సంఖ్యలో పాల్గొని శ్రమదానం చేశారు. అనంతరం గ్రామంలో స్వచ్ఛతా నినాదాలతో ర్యాలీ నిర్వహించి ఐక్యతను చాటారు.



**వెలిచాల గ్రామంలో ప్లాస్టిక్ రహిత గ్రామంగా తీర్చిదిద్దే కార్యక్రమంలో భాగంగా ఆదివారం పలు వినాయక మండపాల వద్ద నిర్వహించిన అన్నదానాల కార్యక్రమాల్లో ఆకు విస్తార్లు, స్టీలు గ్లాస్‌లను వినియోగించారు. ఈ సందర్భంగా సర్పంచ్ వీర్లనర్సింగారావు మాట్లాడుతూ.. ప్లాస్టిక్ నివారించేందుకు గ్రామస్తులు కృషి చేయాలన్నారు.**